
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
గురువారం 30 జనవరి 2025

కండ్లపల్లిలో అరుదైన శిల్పాలు

- పరిశీలించిన కొత్త తెలంగాణ చరిత్ర బృందం
- వెయ్యేళ్ల శిల్పాలుగా గుర్తించిన చరిత్రకారులు

- బీర్‌పూర్, ఆంధ్రజ్యోతి



7

ఎమ్మెల్సీ ఎన్నికలకు మోగిన నగరా

- షెడ్యూల్ జారీ
- జిల్లాలో పట్టభద్రుల ఓట్లు 21,302
- ఉపాధ్యాయ నియోజకవర్గంలో 1,730 మంది ఓటర్లు



8

చట్టాన్ని అతిక్రమిస్తే రౌడీషీట్ ఓపెన్ చేస్తాం

మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : శాంతిభద్రతల పరిరక్షణపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సీఐ : మెట్‌పల్లి సర్కిల్ పరిధిలోని మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాలలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఇసుక, గంజాయి, పేకాట వంటి కార్యకలాపాలను పూర్తిగా అరికడుతున్నాం. చట్టాన్ని అతిక్రమించి వ్యవహరిస్తే రౌడీ షీట్లు ఓపెన్ చేస్తాం.

ఆంధ్రజ్యోతి: నేరాలను అరికట్టేందుకు ఎలాంటి చర్యలు చేపట్టారు?

సీఐ : మెట్‌పల్లి పట్టణంతో పాటు ఇతర మండలాలలో క్రిమినల్ యాక్టివిటీస్ ఉన్న వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టాం. రౌడీ షీటర్లకు ప్రతి నెలా కౌన్సిలింగ్ నిర్వహి స్తున్నాం. బెదిరింపులకు పాల్పడినా, రౌడీ యిజం, సెటిల్మెంట్ చేసినా కేసులు నమో దు చేసి పీడీ యాక్ట్ తెరుస్తాం. గ్రామా ల్లో పంచాయతీలు పెడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజలు నేరుగా ఠాణకు వచ్చి ఫిర్యాదు చేయాలి.

ఆంధ్రజ్యోతి: సర్కిల్ పరిధిలో దొంగతనాలను ఎలా అరికడుతున్నారు?

సీఐ: దొంగతనాల నివారణకు ప్రత్యేక పద్ధతులను అవలంభిస్తున్నాం. దొంగతనాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నాం. సర్కిల్ పరిధిలో ప్రజల సహకారంతో 75 శాతం సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలి.

-మెట్‌పల్లిటౌన్, ఆంధ్రజ్యోతి

ఇంటర్‌లో ఇంగ్లీష్ ప్రాక్టికల్స్



- రేపు ప్రథమ, ఫిబ్రవరి 1న ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభం
- ఇంగ్లీష్ భాషా నైపుణ్యాలపై పరీక్ష
- జిల్లాలో 13,195 మంది ఇంటర్ విద్యార్థులు

జగిత్యాల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రాక్టికల్స్ పకడ్బందీగా నిర్వహించేందుకు విద్యా శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం మొదటి సంవత్సరం, శనివారం రెండో సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్స్ జరుగనున్నాయి. విద్యార్థుల్లో ఇంగ్లీష్ భాషా నైపుణ్యం, వ్యక్తిత్వ వికాసం పెంపొందించేందుకు ప్రభుత్వం గత ఏడాది నుంచి ఇంగ్లీష్‌లో ప్రాక్టికల్ పరీ క్షకు శ్రీకారం చుట్టింది. గతం యేడు ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మాత్రమే ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్ష ఉండగా ఈ ఏడాది ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. మొత్తం 80 మార్కులు థియరీకి కేటాయించగా ప్రాక్టికల్ పరీక్షలకు 20 మార్కులు కేటాయించారు. నాలుగు దశల్లో నిర్వహించే ఈ పరీక్షలో కనీసం 7 మార్కులు వస్తేనే ఉత్తీర్ణులవుతారు. గైర్హాజరైన విద్యార్థులను అనుత్తీర్ణులుగా పరిగణిస్తారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 31వ తేదీన, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఫిబ్రవరి 1వ తేదీన నిర్వహించనుండగా అందుకోసం విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. పర్యావరణ విద్యపై అన్ని రకాల విభాగాలకు సంబంధించిన విద్యార్థులకు ఈ నెల 30వ తేదీన పరీక్ష, ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు.

నాలుగు దశల్లో...

ఒక్కో దశలో నాలుగు మార్కుల చొప్పున, ప్రాక్టికల్ పరీక్షకు నాలుగు మార్కులు కలిపి మొత్తం 20 మార్కులు కేటాయించారు. థియరీలో మార్కులు తగ్గినందున ఆ సబ్జెక్టులో కొన్ని పాఠాలను తొలగిస్తూ సిలబస్‌ను తగ్గించారు. అయితే థియరీలో 28 మార్కులు, ప్రాక్టికల్స్‌లో 7మార్కులు సాధిస్తేనే ఉత్తీర్ణులుగా పరిగణలోకి తీసుకుంటారు. మొదటి దశలో ఏదైనా అంశంపై ఇద్దరు, అంతకంటే ఎక్కువ మంది విద్యా ర్థులు సంభాషించుకునే తీరును అధ్యాపకులు పరీక్షిస్తారు. రెండో దశలో ఇక అంశంపై నిముషంలోపు అనర్గళంగా మాట్లాడాల్సి ఉంటుంది. మూడో దశలో తల్లిదండ్రులు లేదా మరేదైనా అంశపై విద్యార్థులు బృందంగా చర్చించాలి.

ఒక్క నిమిషం మాట్లాడాల్సిందే

ఇంటర్ విద్యార్థుల్లో ఇంగ్లీష్ భయాన్ని పోగొట్టడానికి బోర్డు నిర్వహించనున్న ప్రాక్టికల్స్ పరీక్షలో విద్యార్థులు మూస పద్ధతిలో పరీక్ష నిర్వహించడం కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. విద్యార్థులు ఇంగ్లీష్ ప్రాక్టికల్స్‌లో భాగంగా వారికి ఇష్టమైన టీచర్, ఆట గురించి ఏదో ఒక అంశం గురించి ఒక్క నిమిషం పాటు మాట్లాడాల్సి ఉంటుంది. వారి గురించి విద్యా ర్థులకు తెలిసిన విషయాలు, ప్రత్యేకతలపై 60 సెకన్ల పాటు ప్రసంగించాల్సి ఉంటుంది. ఇలాంటివి మొత్తం 30 అంశాలు ఇస్తారు. వీటిల్లో ఒక దానికి ఎంచుకొని మాట్లాడాల్సి ఉంటుంది. ఇంగ్లీష్ ప్రాక్టికల్స్ మూల్యాం కన పద్ధతుల్లో జస్ట్ ఏ మినట్ (జామ్) ఒకటికిగా నిర్ణయించారు. ఇందులో భాగంగానే విద్యార్థులు నిమిషం పాటు ప్రసగించాల్సి ఉంటుంది. ఇక రోల్ ప్లేలో భాగంగా ఇద్దరు విద్యార్థులు ఒక్క నిమిషం లేదా రెండు నిమిషాల పాటు పరస్పరం...

ఇంగ్లీష్ ప్రాక్టికల్స్‌కు హాజరయ్యే విద్యార్థుల సంఖ్య

ప్రథమ సంవత్సరం..		ద్వితీయ సంవత్సరం..	
జనరల్ కోర్సులు	6,086	జనరల్‌కోర్సులు	5,347
ఒకేషనల్ కోర్సు	968	ఒకేషనల్‌కోర్సు	794
మొత్తం	7,054	మొత్తం	6,141

సైన్స్ విద్యార్థుల సంఖ్య

ప్రథమ సంవత్సరం	ఎంపీసీ	698
ద్వితీయ సంవత్సరం	ఎంపీసీ	2,768
ద్వితీయ సంవత్సరం	బైపీసీ	979,
ద్వితీయ సంవత్సరం	బైపీసీ	1,302

మిగతా 8లో

విశ్వ బ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణించాలి

- విశ్వ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు టీవీ సత్యం



గంగాధర్‌ను సన్మానిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు

జగిత్యాల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విశ్వ బ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరముందని జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు టీవీ సత్యం అన్నారు. జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండు సమీపంలో గల బ్రహ్మంగారి ఆలయంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన బీజేపీ పట్టణాధ్యక్షుడు కొక్కు గంగాధర్, రూరల్ అధ్యక్షుడు ఇట్నేని రమేశ్‌లను బుధవారం పలువురు విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు టీవీ సత్యంతో పాటు కుల పట్టణాధ్యక్షుడు సంకోజి వెంకటరమణ, కుల పెద్దలు గాజోజు నిరంజన్, భల్యాల గంగారాం, కుంబోజు నారాయణ, పెగడపల్లి శ్రీనివాస్, భూమయ్య, హన్మాండ్లు, రాజేందర్, బీజేపీ జిల్లా నాయకులు రాగిళ్ల సత్య నారాయణ, దశరథరెడ్డి, పెద్ద గంగారాం, మాజీ కౌన్సిలర్ అయితి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇటిక్యాల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా రమేష్

రాయికల్: మండలంలోని ఇటిక్యాల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షునిగా చందనగిరి రమేష్ ఎన్నికయ్యాడు. గ్రామంలో బుధవారం నిర్వహించిన ఎన్నికల్లో ఉపాధ్యక్షునిగా గాలిపెల్లి స్వామి, ప్రధాన కార్యదర్శిగా కనపర్తి శ్రీనివాస్, కోశాధికారిగా ఎదురుగట్ల రవీందర్ ఎన్నికయ్యారు. అలాగే గౌరవ సలహాదారులుగా కొడిమ్యాల లింగమూర్తి, మండలోజి శ్రీనివాస్, కొడిమ్యాల శంకరయ్య, చందనగిరి మనోహర్, కొడిమ్యాల శంకర్, శ్రీపాద లక్ష్మీనారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు, యువకులు, సీనియర్ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు ఫీల్డ్ అసిస్టెంట్ల వినతి

రాయికల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తమకు సంబంధం లేకుండా ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లను దూషించి ఇబ్బందులకు గురి చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాయికల్ ఎంపీడీవో చిరంజీవికి బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్లు వినతిపత్రం సమర్పించారు. ఉపాధి కూలీలు తమను ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో ఎంపిక చేయలేదని దూషిస్తున్నారని వినతిపత్రం అందజేశారు. అర్హులైన లబ్ధిదారులు గ్రామ పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ల మండల అధ్యక్షుడు భూక్య తిరుపతి, మహ్మద్ నసీర్, కనికరపు లక్ష్మణ్, మహేష్, మల్లేశం, శ్రీనివాస్, నర్సయ్య, తిరుపతి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళిని పాటించాలి

- కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మండల ప్రత్యేకాధికారులు, జిల్లా పరిషత్, మున్సిపల్ ప్రత్యేకాధికారులతో వివిధ అంశాలపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ వెలువడినందున కోడ్ అమలులోకి వచ్చినట్లయిందన్నారు. రాబోయే మూడు రోజుల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రయివేటు ప్రాంతాల్లో రాజకీయ పార్టీలు, నేతలకు సంబంధించిన ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, గోడ రాతలను పూర్తి స్థాయిలో తొలగించాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ వెలువడినట్లయితే నిర్వహణకు అధికారులు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. ప్రధానంగా ఓటరు లిస్టును సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లాలోని ఆయా మండలాల్లో ఆస్తి పన్ను వసూళ్ల మరింత వేగవంతం చేయాలన్నారు. వంద శాతం లక్ష్యం పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో ఉదయం 6 గంటల నుంచి చెత్త ట్రాక్టర్లు క్షేత్ర స్థాయికి వెళ్లి చెత్తను సేకరించాలని సూచించారు. పరిశుభ్రతను మరింత పెంపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లోకల్ బాడీ అడిషనల్ కలెక్టర్ గౌతమ్ రెడ్డి, డీపీఓ మదన్ మోహన్, డీఆర్‌డీఓ రఘువరన్, ఎంపీడీఓలు, ఎంపీవోలు పాల్గొన్నారు.



సీపీఆర్‌లో మెళకువలు తెలుసుకుంటున్న కలెక్టర్

ఆపద సమయంలో సీపీఆర్ కీలకం

ఆపద సమయంలో ఫస్ట్ ఎయిడ్ సీపీఆర్ కీలకంగా మారుతుందని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. బుధవారం పట్టణంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఫస్ట్ ఎయిడ్ సీపీఆర్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి కలెక్టర్ సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఫస్ట్ ఎయిడ్ కిట్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. యాక్సిడెంట్ అయిన తరువాత చాలా మంది భయపడతారని ఆ సమయంలో ధైర్యంతో ముందుకు వెళ్లి ఒక ప్రాణం కాపాడితే వాళ్ల జీవితాంతం వారిని మరిచిపోరన్నారు. గోల్డెన్ అవర్‌లో సాధ్యమైనంత వరకు ఆ వ్యక్తిని బతికించవచ్చన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించడం, హాస్పిటల్‌కు తరలించి ప్రాణాలు కాపాడడం ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ అశోక్‌కుమార్, ఐఎంఏ సెక్రటరీ డాక్టర్ శ్రీనివాస్, పలువురు పోలీసు అధికారులు, వైద్యులు, సోషల్ రెస్పాండ్ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా పంచాయతీ అధికారిగా హరికిరణ్

జగిత్యాల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ అధికారిగా హరికిరణ్‌ను నియమిస్తూ బుధవారం ప్రభుత్వ కార్యదర్శి లోకేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గత కొంత కాలంగా ఖాళీగా ఉన్న జగిత్యాల డీపీఓ స్థానంలో పోస్టింగ్ కొరకు వెయిటింగ్‌లో ఉన్న డీపీఓ హరికిరణ్‌ను నియమిస్తూ ఆదేశాలు విడుదల అయ్యాయి. రాష్ట్రంలో ముగ్గురు డీపీఓలను బదిలీ చేయగా చేయగా అందులో జగిత్యాల డీపీఓగా హరి కిరణ్ నియామకం అయ్యారు. రెండు, మూడు రోజుల్లో హరికిరణ్ బాధ్యతలు చేపట్టనున్నారు.

నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేయాలి

- పెండింగ్ కేసులను పరిష్కరించాలి
- ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) నేరస్తులకు శిక్ష పడడంలో పోలీసులతో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పాత్ర కీలకమని, నేరస్తులకు ఖచ్చితంగా శిక్షపడేలా కృషి చేయాలని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. గడిచిన సంవత్సరంలో జిల్లాలోని 64కేసులలో నిందితులకు జైలు శిక్ష పడేందుకు కృషి చేసిన పిపిలను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసు నమోదు మొదలు, కేసు విచారణలో సదరు పోలీసు అధికారులకు సూచనలు చేయడంతో పాటు సాక్షులను సరైన పద్ధతిలో ప్రవేశపెట్టడం, అనేక అంశాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకుంటూ కేసులను పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా పిపిలను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



పీపీలను అభినందిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

- పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించాలని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ పోలీసు అధికారులకు సూచించారు. బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో క్రైం మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణపై అన్ని స్థాయిలలో ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పెట్రోలింగ్ వ్యవస్థను మరింత పటిష్ఠ పరచాలన్నారు. సమస్యలను క్షేత్ర స్థాయిలో గుర్తించి ప్రజలకు సమర్థవంతమైనస సేవలు అందించాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందించారు.

విద్యుత్ సమస్యలు పునరావృతం కాకుండా చూడాలి

- ఎస్ఈ సాలియా నాయక్

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ సమస్యలను అధిగమించేందుకు చేపట్టాల్సిన చర్యలపై జిల్లాలోని విద్యుత్‌శాఖ అధికారులతో జిల్లా ఎస్ఈ సాలియా నాయక్ టీపీడీఇఏ భవన్‌లో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత సంవత్సరం నవంబరు 2024 నుంచి ముందుగానే చేపట్టిన కార్యాచరణను పురోగతిలో ఉన్న పనులు, ఇంకా చేపట్టాల్సిన పనులపై సమీక్షించి మార్గదర్శనం చేశారు. జిల్లా పరిధిలో 13 33కేవీ ఇంటర్‌లింకింగ్ పనుల్లో 8పూర్తి అయినవని, పెండింగ్ పనులు ఫిబ్రవరి 10లోగా ప్రతి సబ్‌స్టేషన్‌కి ప్రత్యామ్నాయ సరఫరా పనులు ఫిబ్రవరి 20లోగా పూర్తి చేయాలని అన్నారు. అధిక లోడ్ ఉన్న నియంత్రికల పనులు ఫిబ్రవరి 10లోగా పూర్తి చేయాలన్నారు. వినియోగదారులకు నిరంతర మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు ప్రతి ఉద్యోగి హెడ్‌క్వార్టర్‌లో ఉండాలని ఎస్ఈ ఆదేశించారు. విద్యుత్ వినియోగదారులు గత ఏడాది వేసవిలో ఎదుర్కొన్న ఇబ్బందులు పునరావృతం కాకుండా ఉండేందుకు తమ సమస్యలను సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. 24 గంటలు నిరంతరాయ సేవలకు 1912 టోల్‌ఫ్రీ నెంబర్‌ను డయల్ చేయాలన్నారు.

సమీక్ష అనంతరం సీఈ తిరుమల్‌రావు క్షేత్రస్థాయిలో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సమావేశంలో జగిత్యాల, మెట్‌పెల్లి, డీఈలు, ఏడీఈలు, ఏఈలు అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు నిర్వహించాలి

- జిల్లా లోకల్‌బాడీ అడిషనల్ కలెక్టర్ గౌతమ్ రెడ్డి

జగిత్యాల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు నిర్వహించాలని జిల్లా లోకల్‌బాడీ అడిషనల్ కలెక్టర్ గౌతమ్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఇంటర్ పరీక్షల నిర్వహణపై ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు అన్ని విభాగాలకు చెందిన అధికారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. కేంద్రాలకు విద్యుత్ సరాఫరా అందించడం, సీసీ కెమెరాలు నిఘా నేతృత్వంలో పరీక్షలు జరపాలన్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరే విదంగా ఆర్‌టీసీ అధికారులు రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలని, ఎలాంటి పొరపాటు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి నారాయణ, సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డిమాండ్ల పరిష్కారానికి సీనియర్ సిటిజన్ల పోస్టుకార్డు ఉద్యమం

జగిత్యాల అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్ల పరిష్కారానికి జగిత్యాల జిల్లాలోని సీనియర్ సిటిజన్‌లు పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీనియర్ సిటిజన్ల సమస్యలను పరిష్కరించాలని, రాష్ట్ర అసోసియేషన్ పిలుపు మేరకు డివిజన్ మండల ప్రతినిధులు ప్రధాన పోస్టు ఆఫీస్ కార్యాలయానికి సైకిళ్లపై వెళ్లి పోస్టుకార్డులపై రాసి ప్రధాన మంత్రికి, ముఖ్యమంత్రికి పంపించారు. వృద్ధుల సంక్షేమానికి ప్రత్యేక శాఖ కేటాయించాలని, ఆర్టీసీ బస్సుల్లో వృద్ధులకు ఉచిత ప్రయాణం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గౌరిశెట్టి విశ్వనాథం, వెలుముల ప్రకాష్‌రావు, బొల్లం విజయ్ పాల్గొన్నారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

బెల్లంపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలమై యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని అంబేద్కర్ రడగంబాల బస్తీలో బుధవారం జరిగింది. టూ టౌన్ ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కనుకుల గ్రామానికి చెందిన చింతలవివేక్(21) చిన్నతనంలోనే తండ్రి మృతి చెందగా తల్లి రాజేశ్వరితో కలిసి బెల్లంపల్లి పట్టణంలోని అంబేద్కర్ రడగంబాల బస్తీలో ఉంటున్నాడు. పదో తరగతి వరకు చదివిన వివేక్ మంచిర్యాల పట్టణంలోని ఓబట్టల దుకాణంలో పనిచేసేవాడు. ఇటీవల స్థానికంగా ఓయువతిని ప్రేమించాడు. ఆమె ఒప్పుకోకపోవడంతో బాధపడుతూ దిగాలుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి తల్లి, అమ్మమ్మతో కలిసి టీవీ చూస్తూ పడుకున్నాడు. బుధవారం ఉదయం ఏడు గంటలకు వివేక్‌ను లేపుదామని వెళ్లగా రేకుల షెడ్డు పైకప్పుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఓసీపీ-2 కార్మికుడి..

రామగిరి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2లో జనరల్ మజ్దూర్‌గా పనిచేసే దాయక శ్రీనివాస్ (52) ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఓసిపి-2 స్టోర్స్‌లో పని చేసే శ్రీనివాస్ ఆరు నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. చికిత్సపొందినా ఫలితం లేకపోవడంతో మనస్తాపానికి గురై బుధవారం ఉదయం సెంటినరీకాలనీలోని ఎస్‌టిటూ 551నెంబరు క్వార్టర్ ఎదుట ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్ళు ఉన్నారు.

చెరువులో వృద్ధురాలి మృతదేహం లభ్యం

కోరుట్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోహన్‌రావు పేట గ్రామంలోని చెరువులో వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. మృతురాలి పుర్రెను కుక్కలు పీక్కుని వ్యవసాయ క్షేత్రంలో పడేయడంతో బుధవారం ఘటన వెలుగు చూసింది. సంఘటన స్థలంను కోరుట్ల సీఐ సురేష్‌బాబు తన సిబ్బందితో పరిశీలించి గ్రామస్థుల సహకారంతో మోహన్‌రావుపేట గ్రామానికి చెందిన వృద్ధురాలుగా గుర్తించారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కుంట లింగవ్వ (87) మతిస్థిమితం సరిగా లేక ఈ నెల 2వ తేదీన ఇంట్లో నుంచి వెళ్లింది. తల్లి అచూకీ లభిచడం లేదని ఈ నెల 11వ తేదీన లింగవ్వ కుమారుడు రవి కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కోరుట్ల పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. గ్రామంలోని చిలుక చెరువు ప్రాంతంలో ఓ వృద్ధురాలు తల ఉందని గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు చెరువులో వృద్ధురాలి మృతదేహం గుర్తించారు. పోస్టుమార్టం నిర్వహించి గ్రామస్థుల ఆధ్వర్యంలో ఖననం చేశారు. 26 రోజులుగా మృతదేహం చెరువులో ఉండ డంతో పూర్తిగా కుల్లిపోయి ఉంది. తల వేరయి ఒడ్డుకు చేరడంతో కుక్కలు ఎత్తుకువచ్చినట్లు పోలీసులు తెలిపారు.

108వాహనం ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు


తీవ్రంగా గాయపడ్డ కిషన్

మానకొండూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : 108వాహనం ఢీకొని అసిస్టెంట్ లైన్‌మెన్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. మండలంలోని జగ్గయ్యపల్లి అసిస్టెంట్ లైన్‌మెన్ బి కిషన్ బుధవారం మండలంలోని అన్నారం గ్రామంలో విధులను నిర్వహించేందుకు మోటార్ సైకిల్‌పై వెల్లుతున్నాడు. అన్నారం నుంచి కరీంనగర్ వైపు వెలుతున్న 108 వాహనం స్థానిక హన్మాన్ ఆలయం మూలమలుపు వద్ద కిషన్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కిషన్‌కు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కి తరలించినట్లు విద్యుత్ సిబ్బందితెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

శంకరపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కుక్క అడ్డు రావడంతో ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తి అదుపుతప్పి కిందపడి గాయాలైన సంఘటన మండలంలోని ఎరడపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. వీణవంక మండలం గంగారం గ్రామానికి చెందిన నరహరి ఇంద్రసేనారెడ్డి వ్యక్తిగత అవసరాల నిమిత్తం ఎరడపల్లి గ్రామానికి వచ్చి తిరిగి తన స్వగ్రామం వెళ్తున్నాడు. గ్రామశివారులో కుక్క అడ్డు రావడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. ఈప్రమాదంలో ఇంద్రసేనారెడ్డి కుడికాలు విరిగింది. గమనించిన స్థానికులు 108లో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు

రామగిరి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని పోచమ్మగుడి వద్ద గంజాయి అమ్ముతూ పట్టుబడిన ముగ్గురు వ్యక్తులపై కేసునమోదుచేశారు. గ్రామంలోని ఆలయం వద్ద గంజాయి అమ్ముతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ చంద్రకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేయగా సుల్తాన్‌బాద్‌కు చెందిన సుమంత్, పెద్దపల్లికి చెందిన పెంచాల సాయికృష్ణ, కల్వచర్లకు చెందిన చిప్పకుర్తి అజిత్ గంజాయి విక్రయిస్తున్నారు. పోలీసుల రాకను గమనించి అజిత్ పరారు కాగా సుమంత్, సాయికృష్ణలను అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద 30గ్రాముల గంజాయి, బైకు, మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు.

విద్యుత్ కంచె బిగించిన వ్యక్తిపై కేసు

కథలాపూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూషణరావుపేట శివారులోని అడవుల్లో విద్యుత్ కంచె అమర్చి అడవి జంతువుల మృతికి కారకుడైన అపావత్ తిరుపతిపై కేసు నమోదు చేసినట్లు డిప్యూటీ రేంజ్‌అధికారి సురేశ్ తెలిపారు. బుధవారం సంఘటనా స్థలం పరిశీలించి వెటర్నరీ వైద్యులతో పంచనామా నిర్వహించారు. అనంతరం తిరుపతిని అదుపులోకి తీసుకుని మెట్‌పల్లి ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంకు తరలించారు. అడవి జంతువులకు విద్యుత్ కంచెలు ఏర్పాటు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈసందర్భంగా బీట్‌అధికారులు శివరాజ్, శ్రావణ్, సాయిరాం ఉన్నారు.

అదనపు వరకట్నం కోసం వేధింపులు.. కేసు నమోదు

జమ్మికుంట రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అదనపు వరకట్నం కోసం తన భర్తనిత్యం వేధింపులకు గురిచేస్తున్నాడంటూ ఓ వివాహిత ఇచ్చిన పిర్యాదు మేరకు పోలీస్‌లు కేసునమోదుచేశారు. జమ్మికుంటకు చెందిన మాడుగుల సంధ్య, మండలంలోని మాచనపల్లికి చెందిన మాడుగుల కళ్యాణ్ చక్రవర్తికి 2014లో కట్న కానుకలు ఇచ్చి పెద్దలు ఘనంగా వివాహం జరిపించారు. కొన్ని సంవత్సరాలు వారి కాపురం సజావుగా సాగింది. వీరికి ఇద్దరు పిల్లలు జన్మించారు. కొంత కాలంగా అదనపు వరకట్నం తేవాలంటూ భర్త వేధింపులకు గురి చేస్తున్నాడని సంధ్య పేర్కొంది. ఈ మేరకు ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కళ్యాణ్ చక్రవర్తిపై అదనపు వరకట్నం కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు: బెల్లం పానకం ధ్వంసం

కోనరావుపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలంలోని పలుతండాల్లో ఎక్సైజ్‌అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. 400లీటర్ల బెల్లంపానకం ధ్వంసంచేసి, ఏడు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. నిమ్మపల్లి దేవునితండా వట్టిమల్ల, బావుసాయిపేట, కమ్మరిపేట తండాల్లో గుడుంబాను తయారుచేస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో బెల్లంతో చేసిన గుడుంబాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇందుకు బాధ్యులైన ముగ్గురిపై కేసు నమోదుచేసి 8మందిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ అధికారులు ఎస్సైలు శైలజ, ప్రణీత్ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్లక్ష్యం చేస్తే శాశ్వత అంగవైకల్యం

- 'కుష్ఠు'ను అరికట్టేందుకు లక్షణాలు గుర్తించి మందుల పంపిణీ
- నేడు కుష్ఠు నివారణ దినం
- వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు



(సుభాష్‌నగర్/సిరిసిల్ల, ఆంధ్రజ్యోతి)

కుష్ఠు.. ప్రాణాంతకమైన వ్యాధి కాదు.. అయినా నిర్లక్ష్యం చేస్తే శాశ్వత వైకల్యాన్ని కలిగించే మహమ్మారి. గతంతో పోల్చుకుంటే వ్యాధి తీవ్రత తగ్గిపోయినా.. ఇటీవల పెరుగుతున్నట్లు అంచనా వేసిన వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. జాతీయ ఆరోగ్య మిషన్ ప్రత్యేక సర్వేను చేస్తోంది. ప్రతి సంవత్సరం జనవరి 30న మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా కుష్ఠు వ్యాధి నివారణ దినోత్సవంగా జరుపుతున్నారు. జనవరి 30 నుంచి ఫ్రిబవరి 13 వరకు పక్షోత్సవాలను నిర్వహిస్తూ ప్రజల్లో కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కుష్ఠు వ్యాధి నిర్మూలనలో భాగంగా ప్రతి సంవత్సరం వైద్య ఆరోగ్య శాఖ సర్వేలు చేస్తున్నారు. అనుమానితులను గుర్తించి పరీక్షలు చేస్తున్నారు. కుష్ఠు వ్యాధి ప్రాణాంతకం కాకపోయినా అంగవైకల్యానికి దారి తీస్తుంది. ముందుగానే గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా అరికట్టడం సులువు అవుతుందని భావిస్తున్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా వ్యాధిగ్రస్థులను గుర్తించే దిశగా ఇంటింటి సర్వేలు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 11 మందిలో కుష్ఠు వ్యాధిని నిర్ధారించి చికిత్సను అందిస్తున్నారు.శాశ్వత అంగవైకల్యానికి గురికాకుండా అవసరమైన వారికి హైదరాబాద్‌లో శస్త్రచికిత్సలు కూడా చేయిస్తున్నారు. శస్త్ర చికిత్సల అనంతరం వారికి పౌష్టికాహారం, ఇతర అవసరాలకు ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ప్రభుత్వ పరంగా ఫించన్లతో పాటు ఎంసీఆర్ చెప్పులు, మందుల కిట్లు అందిస్తున్నారు.

కారణాలు.. లక్షణాలు

కుష్ఠు వ్యాధి మైక్రో బాక్టీరియమ్‌లేప్రే బాక్టీరియా వల్ల వస్తుంది. ఒకరి నుంచి ఒకరికి అంటుకోదు. వ్యాధిక్రిములు శరీరంలోకి ప్రవేశించిన తరువాత రెండు నుంచి ఏడు రోజుల్లో వ్యాధి లక్షణాలు బయటపడుతాయి. ఈ వ్యాధి వల్ల చర్మం, మ్యూకస్ మెంబ్రేన్ నరాలు వ్యాధికి గురవుతాయి. రోగ నిరోధకశక్తిని బట్టి లక్షణాలు మారుతుంటాయి.

రోగి సరైన జాగ్రత్తలు తీసుకోకుండా ఉండడం వల్ల దుమ్ముధూళి, ఊపిరి ద్వారా లోపలికి చేరుకోవడం వల్ల రోగ నిరోధకశక్తి తగ్గుతుంది. జబ్బును చాలా ముందుగా తేలికగానే తెలుసుకోవచ్చు. రంగు తగ్గిన మచ్చలు, చుట్టూ ఉన్న చర్మంతో పోలిస్తే మచ్చలు పాలిపోయినట్లు ఉంటాయి. మచ్చలు గుండ్రటి అకారంలో ఉండి వేడి, నొప్పి, స్పర్శ తెలియదు. ప్రధానంగా స్పర్శ జ్ఞానం కనిపించదు. చర్మం మీద మచ్చలు ప్రాంతానికి వచ్చే నాడులు వాపు తేలడం, మోకాలి వెలుపల పక్కన, మోచేయి లోతట్టున, మెడలోను లావెక్కిన నాడులు తెలుస్తాయి. నాడులు వాచడం జరుగుతుంది. నొప్పి, దురద, పుండ్లు వచ్చి మానకపోవడం, మొఖం మీద చర్మం మందంగా తేలి ఉండడం, కనుబొమ్మలు వెంట్రుకలు రాలిపోవడం, పాదాలు, చేతులు శక్తిహీనమై వంకరలు తిరుగుతుంటాయి. తెల్లమచ్చలు ఉన్నచోట స్కిన్ క్లిప్ పరీక్ష చేసి క్రిములను గుర్తించి వైద్యాన్ని అందిస్తారు. కుష్ఠు లక్షణాలు ఉన్నావారు కంటి విషయంలోనూ, అవయవాలపై జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రస్తుతం వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా సురక్షితమైన మందులను అందిస్తున్నారు.

సకాలంలో గుర్తిస్తే తగ్గించుకోవచ్చు..



- డాక్టర్ రజిత, రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్యాధికారి

కుష్ఠు వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి. సకాలంలో గుర్తిస్తే మందులతో సులువుగా తగ్గించుకోవచ్చు. వ్యాధి లక్షణాలను గుర్తించి వారికి మందులు అందించడానికి సర్వేలు నిర్వహిస్తున్నాం. కొంత మంది శరీరంపై ఏర్పడే మచ్చలపై నిర్లక్ష్యం చేస్తున్నారు. వీరిలో అవగాహన కల్పించడానికి కుష్ఠు వ్యాధి నివారణకు పక్షోత్సవాలు నిర్వహిస్తున్నాం.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా మందులు...

- డాక్టర్ అనిత, రాజన్న సిరిసిల్ల జిలా ప్రోగ్రాం అధికారి

జనవరి 30న కుష్ఠు నివారణ దినోత్సవం నుంచి ఫిబ్రవరి 13 వరకు ప్రతి గ్రామంలో వ్యాధిపై అవగాహన కల్పిస్తాం. ప్రజల్లో ఎవరికైనా ఏమైనా మచ్చలు ఉంటే అశా కార్యకర్తకు, ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్సలు చేసుకోవాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా మందులు అందిస్తాం.



అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తాం...

- డాక్టర్ సుధారాజేంద్ర, కరీంనగర్ జిల్లా కుష్ఠు వ్యాధి నివారణ అధికారి



కుష్ఠు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగంగా బుధవారం మానకొండూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో శిబిరాన్ని నిర్వహిస్తున్నాం. ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 13వరకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తాం. 'కలిసి అవగాహన పెంచుకుందాం-అపోహలను తొలగించు కుందాం'.. అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తాం.

ట్రాక్టర్ బోల్తా పడి యువ రైతు మృతి


నవీన్ (ఫైల్)

రాయికల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తన వ్యవసాయ భూమిలో పొలం దున్నుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి యువరైతు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రామాజీపేట గ్రామానికి చెందిన ఇద్దం నవీన్‌రెడ్డి (27) అనే యువ రైతు తన కేజీవీల్ ట్రాక్టర్‌ను తీసుకువెళ్లి రామాజీపేట- కుమ్మరి పెల్లి గ్రామాల మధ్యగలతన భూమిలో బుధవారం వరినాట్ల కోసం దున్నుతుండగా ట్రాక్టర్ బురదలో దిగబడింది. ట్రాక్టర్ నుంచి కేజీవీల్ తొలగించే క్రమంలో ట్రాక్టర్ ఒక్కసారిగా బోల్తా పడి నవీన్ మీద పడింది. దీంతో బురదలో కూరుకుపోయిన నవీన్ ఊపిరాడక సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. గమనించిన స్థానికులు జేసీబీ సహాయంతో ట్రాక్టర్ కింద నుంచి నవీన్ మృతదేహాన్ని బయటకు తీశారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నవీన్‌కు భార్య, ఐదేళ్లలోపు కుమారుడు, కూతురు ఉన్నారు. నవీన్ తండ్రి ఇటీవల మృతి చెందడంతో ఇంటికి పెద్ద దిక్కుగా ఉండగా, అతని మృతితో కుటుంబం కన్నీరుమున్నీరవుతుంది. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు.

అనుపురంలో శివలింగం మాయం

వేములవాడ టౌన్, జనవరి29 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం అనుపురం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ప్రతిష్ఠించిన శివలింగాన్ని మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. మాఘ అమావాస్యను పురస్కరించుకుని బుధవారం పూజలు నిర్వహించేందుకు వెళ్లిన గ్రామస్థులు ఆలయంలో శివలింగం లేకపోవడం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో బీజేపీ నాయకుడు ఎర్రం మహేష్ ఆధ్వర్యంలో వెంటనే పోలీసుల సమక్షంలో నూతన శివలింగాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహాన్ని అపహరించిన వారిని పట్టుకుని చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

గడ్డంపల్లెలో తాళం వేసిన ఇంట్లో చోరీ

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం సుందిల్ల గ్రామపరిధిలోని గడ్డంపల్లె గడ్డం రాజయ్య ఇంట్లో చోరీ జరిగింది. ఇంటి యజమాని రాజయ్య అనారోగ్యం బారిన పడడంతో మూడురోజుల క్రితం కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. బుధవారం ఇంటికి వచ్చేసరికి తాళాలుపగులగొట్టి ఉండడాన్ని గమనించి గోదావరిఖని టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ ప్రసాదరావు చోరీ జరిగిన తీరును గమనించి, రాజయ్య కుటుంబ సభ్యుల నుండి అపహరణకు గురైన సొత్తు వివరాలను తెలుసుకున్నారు. 100తులాల వెండి, తులం బంగారు ఆభరణం, రూ.50వేల నగదు చోరీకి గురైనట్లు బాధితులు పోలీసులకు తెలిపారు.

దైవదర్శనానికి వెళుతూ అనంతలోకాలకు

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం
- మృతులు సిద్దిపేట వాసులు
- డ్రైవర్ నిద్రమత్తే ప్రమాదానికి కారణం


జనార్దన్


ఆకుల కనుకయ్య, ఆకుల తార


కల్వర్టును ఢీ కొన్న కారు

సుల్తానాబాద్ , జనవరి 29: (ఆంధ్రజ్యోతి): రెండు కుటుంబాలు దైవ దర్శనం కోసం బయలుదేరగా రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు వారిని కబళించింది. సిద్దిపేట జిల్లా కేంద్రం నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ఆలయ దర్శనానికి కారులో బయలుదేరగా పెద్దపల్లి జిల్లా కాట్నపల్లి శివారులో కారు కల్వర్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట శ్రీనగర్ కాలనీకి చెందిన ఆకుల కనుకయ్య (60) ఆయన భార్య ఆకుల తార (50)తో పాటు వారి కుమారుడు ఆకుల శ్రీనివాస్, వియ్యంకుడు జంగిటి జనార్దన్ (45) ఆయన భార్య రమాదేవి, వీరి కుమారుడు జంగిటి మనోజ్‌కుమార్‌తోపాటు ఆకుల మాన్విత, ఆకుల ఆర్యన్‌లు డ్రైవర్‌తో కలిపి తొమ్మిది మంది కారులో బుధవారం తెల్లవారుఝామున మూడు గంటల ప్రాంతంలో దైవదర్శనం కోసం బయలుదేరారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి వద్ద రాజీవ్ రహదారి పై కల్వర్టును ఢీకొంది. వేగంగా వస్తున్న కారు కల్వర్టు గోడను ఢీ కొనడంతో కారు ముందు బాగంగా నుజ్జు నుజ్జు అయింది. కారు ముందు సీట్లలో కూర్చున్న ఆకుల కనుకయ్య, తార దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన జంగిటి జనార్దన్‌ను కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆకుల శ్రీనివాస్, రమాదేవి, ఆర్యన్, మాన్విత, మనోజ్‌కుమార్‌తో పాటు డ్రైవర్ వై బాల్‌రెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్ కుమార్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. కాగా డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా ప్రమాదం జరిగిందని పోలీసులు పేర్కొన్నారు.

దొంగతనానికి వచ్చి.. సీసీ కెమెరాకు చిక్కి..

- నిందితుడిని బంధించిన కాలనీవాసులు..
- పోలీసులకు అప్పగింత


చోరీకి యత్నించిన దొంగ

వేములవాడ, జనవరి29 (ఆంధ్రజ్యోతి): ఇళ్లలో చోరీకి యత్నించిన ఓ దొంగ సీసీ కెమెరాకు చిక్కాడు. దీంతో స్థానికులకు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వేములవాడ పట్టణంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. స్థానిక మోచివీధిలో బుధవారం తెల్లవారు జామున దొంగతనం కోసం వచ్చిన ఓ వ్యక్తి ముందుగా రెండు ఇళ్లలో చొరబడ్డాడు. అదేక్రమంలో మూడో ఇంటికి వెళ్లి పైఅంతస్తులోకి ప్రవేశించి అందిన కాడికి కాజేశాడు. అయితే గోడ దూకుతున్న శబ్దం రావడంతో ఇంటి యజమానికి మెలుకువవచ్చి అనుమానంతో సీసీ కెమెరాలు పరిశీలించగా దొంగ ఇంటిలోకి ప్రవేశిస్తున్న దృశ్యాలు కనిపించాయి. అదే సమయంలో దొంగపక్కనే ఉన్న ఇంటిలోకి దూకడంతో పక్కింటి వారికి ఫోన్ చేసి అప్రమత్తం చేశాడు. వెంటనే వాళ్ల తేరుకొని చుట్టుపక్కల వారిని లేపడంతో దొంగను పట్టుకొని బంధించి పోలీసులకు అప్పగించారు. సీసీకెమెరాలో తన ముఖం కనబడకుండా టవల్ కప్పుకోవడంతోపాటు తలుపులు ఇతర వస్తువులపై వేలిముద్రలు పడకుండా గ్లౌస్ ధరించడం గమనార్హం. దొంగతనం చేసే క్రమంలో కొంత నగదుతో పాటు వెండిని కూడా చోరీచేయగా ప్రస్తుతం వేములవాడ పట్టణపోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. దొంగతనంఘటనలో అనుమానితుడిని విచారిస్తున్నామని సీఐ వీరప్రసాద్ తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా కేసులో ఇద్దరి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకరవాణా చేస్తున్న వ్యక్తితోపాటు డబ్బులు డిమాండ్ చేస్తూ బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులిద్దరిని బుధవారం అరెస్ట్ చేశామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ముస్తాబాద్ మండలంలోని కొండాపూర్ శవారులోని మానేరు వాగునుంచి టిప్పర్ ద్వారా పాక చంద్రమౌళి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నాడని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఇసుకను అక్రమంగా రవాణాచేస్తుండగా వీడియోలుతీసి రూ.10వేలుఇవ్వాలని బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేశామన్నారు. ఇద్దరు వ్యక్తులను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించా మని ఆయన తెలిపారు. ఈ కేసులోటిప్పర్, లారీ, కారును సీజ్ చేశామన్నారు.

అక్రమ వసూళ్లకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్

సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేట వద్ద కలప లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను ఆపి అక్రమ వసూళ్లకు పాల్పడిన వ్యక్తిపై కేసునమోదుచేసి అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ముస్తాబాద్, జనవరి29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నామాపూర్‌లో బుధవారం ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. కామారెడ్డికి చెందిన పెంగర్లరాజు(30) చీకోడు గ్రామంలో నివసిస్తున్నాడు. కాగాపనిమీద ముస్తాబాద్ వచ్చి వెళ్తుండగా నామాపూర్ శివారులో ఎదురుగా ద్విచక్రవాహనం రావడంతో ఢీకొని తీవ్రగాయాల పాలయ్యాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. అతనికి భార్య ఉమ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నాలుగురోజులైనా మిస్టరీ వీడని మమత కేసు

- 25న మంచిర్యాలలో కారెక్కి.. 27న గంగాధరలో శవమైన మమత


మమతతో కొడుకు ధృవన్(ఫైల్)

గంగాధర, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మమత(30) హత్యకేసు మిస్టరీ నాలుగు రోజులైనా వీడలేదు. మమతది కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట మండలం. భర్తతో గొడవపడిన ఆమె నాలుగు నెలల క్రితం మంచిర్యాలలోని బంధువుల ఇంటికివచ్చింది. ఈనెల 25న ఆమె నూనె ప్యాకెట్ తీసుకొస్తానని చెప్పి కొడుకును తీసుకుని కారులో ఎక్కిన మమత 27న గంగాధర మండలం కురిక్యాల వరదకాలువ సమీపంలో శవమై కనిపించింది. గంగాధర పోలీసులు అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. వివిధ పత్రికల్లో వచ్చిన కథనానికి కుమరం భీం ఆసిఫాబాద్‌లోని తల్లిదండ్రులు గంగాధర పోలీసులకు తమ కూతురేనని సమచారం అందించారు. ఐదేళ్లకింద భరత్ అనే వ్యక్తిని ప్రేమపెళ్లి చేసుకోగా వారికి కుమారుడు ధృవన్(4) ఉన్నాడు. అయితే భార్యభర్తల మధ్య మనస్పర్థలతో మమత నాలుగు నెలలుగా తల్లిగారింట్లో ఉంటోంది. ఈనెల 25న పెంచికల్‌పేట తల్లిగారింట్లో నుంచి నూనె ప్యాకెట్ తీసుకొస్తానని చెప్పి కుమారుడిని తీసుకుని కారులో ఎక్కినట్లు సీసీ ఫుటేజీల్లో రికార్డైంది. 27న గంగాధర మండలంలో మమత శవమై కనిపించింది. అయితే మమతను చున్నీతో హత్య చేయగా నాలుగు రోజులైనా కుమారుడి ఆచూకీ లభ్యం కాలేదు. మమతను కారులో తీసుకొచ్చింది ఎవరు.. అక్కడే హత్యచేసి గంగాధరలో పడేశారా లేక ఇక్కడే హత్య చేశారానేది ఇప్పటికీ మిస్టరీగానే మిగిలింది. మార్చురీలో ఉన్న మమత మృతదేహాన్ని బుధవారం తల్లిదండ్రులు, భర్త గుర్తించారు. అనంతరం మమత మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి వారికి అప్పగించారు. ప్రస్తుతం ఈ కేసు గంగాధర పోలీసులకు సవాలుగా మారింది. కారు ఆచూకీ కోసం ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలో పలు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఎవ్వరు హత్య చేశారు, హత్యలో ఎంతమంది పాల్గొన్నది, కారు లభిస్తేనే పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసుల భావిస్తున్నారు.

కాసిపేటలో ముగిసిన మమత అంత్యక్రియలు..

కాసిపేట: జగిత్యాల జిల్లా గంగాధర మండలం కుడిక్యాల వరద కాలువసమీపంలో అనుమానాస్పదంగా మృతిచెందిన మేడ మమత(30) అంత్యక్రియలు బుధవారం మంచిర్యాల జిల్లా కాసిపేట గ్రామంలో అత్తింటి వారు నిర్వహించారు.

ధృవన్ ఎక్కడ?

- సెల్‌ఫోనే కీలక ఆధారం..
- పోలీసుల అదుపులో అనుమానితులు?

కరీంనగర్‌క్రైం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మమతతోపాటే ఉన్న కొడుకు జాడ మూడు రోజులైనా తెలియకుండా పోయింది. మృతదేహంపై ఉన్న గాయాల ఆధారంగా ఆమెది హత్యగా భావిస్తున్నారు. కానీ ఆమెతో ఉన్న కొడుకు, సెల్‌ఫోన్‌లు ఎక్కడ ఉన్నాయనేది తెలిస్తే మమత మృతికి కారణాలు వెల్లడయ్యే అవకాశముంది. మమత వెళ్లిన కారు ఎవరిది? కారులో వచ్చినవారు మమతకు పరిచయస్థులేనా? లేదా మాయమాటలు చెప్పి తీసుకుపోయారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఫోన్‌మాట్లాడుకుంటూ వెళ్లిన మమత దారిలోనే కారులో ఎక్కి వెళ్ళటం చూస్తే కారులో వచ్చిన వ్యక్తులు ఆమెకు పరిచయస్తులేనని వెల్లడవుతోంది. మమత అనుమానాస్పదస్థితిలో శవమై కనిపించడం, ఆమె కొడుకు జాడకోసం పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

మమత మృతి మిస్టరీని ఛేదించేందుకు 4స్పెషల్ పోలీసుటీంలను ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఒకటీం మంచిర్యాల నుంచి గంగాధర వరకు సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తుండగా మరోటీం సెల్‌ఫోన్ టవర్‌డంపు ఆధారంగా అనుమానిత ఫోన్‌కాల్స్‌ను పరిశీలిస్తూ మిస్టరీని ఛేదించే పనిలో ఉన్నట్లు తెలిసింది. మరో వైపున అదృశ్యమైన ధృవన్ కోసం పోలీసులు వివిధ ప్రాంతాల్లో గాలిస్తున్నారు. మమత కుటుంబ సభ్యులతోపాటు బంధువులు, ఆమె భర్త, బంధువులను ఇప్పటికే విచారించిన పోలీసులు మరికొందరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ధృవన్‌ను క్షేమంగా పట్టుకోవటమే ప్రధానధ్యేయంగా పోలీసులు అప్రమత్తంగా ఏ చిన్న ఆధారం, సమాచారాన్ని కూడా వదిలి పెట్టకుండా నిశితంగా పరిశీలిస్తూ ఉన్నతాధికారుల సూచనలతో ముందుకుసాగుతున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల సందడి

- షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల సంఘం
- ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ
- కాంగ్రెస్ అభ్యర్థులపై కొనసాగుతున్న సస్పెన్స్



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల కాగానే జిల్లాలో ఒక్కసారిగా ఎన్నికల హడావుడి మొదలైంది. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలా బాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీల పదవీ కాలం మార్చి 29తో ముగియనుంది. ఆయా రాజకీయపార్టీల్లోని ఆశావహులు నాలుగు నెలల క్రితం నుంచే ఓటర్లను చేర్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలోని 42 అసెంబ్లీ స్థానాలు, ఆరు పార్లమెంట్ స్థానాల్లోని పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఈ ఎన్నికల్లో ఓటు చేయనున్నందున ఈ ఎన్నికలకు ప్రాధాన్యం పెరిగింది. మేధావి వర్గంగా భావించే పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఈ ఎన్నికల్లో ఇచ్చే తీర్పు ప్రజాభిప్రాయానికి ప్రతీకగా నిలిచింది. తమ భవిష్యత్ రాజకీయాలను ప్రభావితం చేస్తుందని రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. ఈ ఎన్నికల్లో గెలుపుపై ఆయా పార్టీలు ప్రత్యేక దృష్టిసారించనున్నాయి. ఎన్నికలు ఫిబ్రవరిలో జరుగుతాయని మొదటి నుంచే తెలిసిన నేపథ్యంలో నాలుగు నెలల క్రితం నుంచే ఆయా పార్టీల నుంచి పోటీచేసే ఆశావహులు ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని పోటాపోటీగా చేపట్టారు. నాలుగు జిల్లాల్లో వారు విస్తృతంగా పర్యటించి ఓటర్లను చేర్పించడమే కాకుండా తామే అభ్యర్థిగా ప్రచారం చేసుకొని మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేశారు. అధికార కాంగ్రెస్ నుంచి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి రాజీనామా చేసిన ప్రసన్న హరికృష్ణతోపాటు మరికొందరు టికెట్ ఆశిస్తున్నారు. ఎంఐఎం రాష్ట్ర నాయకుడు డాక్టర్ బీఎన్‌రావు, కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, ట్రస్మా రాష్ట్ర మాజీ చైర్మన్ యాదగిరి శేఖర్‌రావు బీఆర్‌ఎస్ టికెట్ ఆశిస్తున్నారు. బీజేపీ అభ్యర్థిగాచెందిన అంజిరెడ్డిని ఆ పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. వీరందరూ ముమ్మరంగా ఓటర్లను నమోదు చేయిస్తూ ముందస్తు ప్రచారాలను నిర్వహించారు. ఈ కారణంగానే ఓటర్ల సంఖ్య గతంలో ఎన్నడూ లేని విధంగా 3.5 లక్షలకు చేరింది.

● కమలంలో కదనోత్సాహం...

పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలపై బీజేపీ కదనోత్సాహాన్ని ప్రదర్శిస్తున్నది. ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం పట్టభద్రుల స్థానానికి మెదక్ జిల్లాకు చెందిన సి అంజిరెడ్డిని, ఉపాధ్యాయస్థానానికి పెద్దపల్లి జిల్లాకు చెందిన మల్క కొమురయ్యను అభ్యర్థులుగా ప్రకటించింది. 20 రోజుల క్రితమే అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ నియోజకవర్గ పరిధిలోని అన్ని ఉమ్మడి జిల్లాల్లో సమావేశాలు నిర్వహించి అభ్యర్థులకు మద్దతుగా పార్టీశ్రేణులు, నేతలను సమాయత్తం చేయడంతోపాటు బాధ్యతలను అప్పగించింది. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో కూడా ఈ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాన్ని చర్చించి, ఖరారు చేశారు. పట్టభద్రుల స్థానానికి అభ్యర్థిగా ఎంపిక చేసిన అంజిరెడ్డి భార్య గోదావరి ప్రస్తుతం బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలుగా పని చేస్తున్నారు. ఉపాధ్యాయ అభ్యర్థి మల్క కొమురయ్య హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నిర్వహకుడు. పల్లవి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయన మల్కాజిగిరి ఎంపీ స్థానానికి పోటీ చేయడానికి ఆసక్తి చూపించి టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం ఎమ్మెల్సీ అభ్యర్థిగా రంగంలోకి దిగారు. వీరికి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ అండదండలు ఉన్నాయని, ఆ కారణంగానే వారు అభ్యర్థులుగా తెరపైకి వచ్చారని ప్రచారం జరుగుతోంది. పట్టభద్రుల స్థానానికి టికెట్ ఆశించిన సుగుణాకర్‌రావు, రామకృష్ణారెడ్డి పార్టీ నిర్ణయంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. వారిద్దరు బాహాటంగానే తమ అసంతృప్తిని వెలిబుచ్చారు. సుగుణాకర్‌రావు ఇప్పటికీ ఎన్నికల బరిలో ఉండే ఆలోచనలో ఉన్నట్లుగానే ప్రచారం జరుగుతున్నది.

● తేలని కాంగ్రెస్ అభ్యర్థి

అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎంపిక విషయంలో తర్జనభర్జన పడుతోంది. టీపీసీసీ స్థాయిలో రెండుసార్లు చర్చలు జరిగినా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, కేసీ వేణుగోపాల్ రాష్ట్రానికి వచ్చి నాయకులతో చర్చించినా అభ్యర్థి ఎవరన్నది తేలలేదు. ప్రధానంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి, ప్రసన్న హరికృష్ణ పోటీలో ఉన్నారు. వీరిలో మెజార్టీ నేతలు నరేందర్‌రెడ్డి వైపే మొగ్గుచూపుతున్నారని, నాలుగు జిల్లాల పరిధిలో నియోజకవర్గం విస్తరించి ఉన్నా ఓటర్లలో 50 శాతం కరీంనగర్‌జిల్లాకు చెందినవారే ఉన్నారు. దీంతో ఇక్కడి అభ్యర్థినే పోటీలోకి దింపితే బాగుంటుందనే అభిప్రాయాన్ని ఉమ్మడి జిల్లా నేతలు వ్యక్తం చేసినట్లు సమాచారం. అధిష్ఠానం మాత్రం ఇప్పటికీ ఈ విషయంలో ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదు.

● సందిగ్ధంలో బీఆర్‌ఎస్

ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్‌ఎస్ ఈ ఎన్నికల విషయంలో స్తబ్దంగా ఉంది. ఆ పార్టీకి చెందిన రవీందర్‌సింగ్, బీఎన్‌రావు, యాదగిరి శేఖర్‌రావు టికెట్ ఆశించి నాలుగు నెలలుగా ప్రచారం చేసుకుంటున్నా పార్టీ మాత్రం ఇప్పటి వరకు జిల్లాస్థాయిలోగానీ, రాష్ట్రస్థాయిలోగానీ ఈ ఎన్నికల విషయంలో ఎలాంటి సమావేశాన్ని నిర్వహించలేదు. దీంతో ఈ ఎన్నికల్లో పార్టీ అధికారికంగా అభ్యర్థిని నిలుపక పోవచ్చని అభిప్రాయం నెలకొన్నది. అధిష్ఠానం విషయాన్ని స్పష్టం చేయకపోవడంతో తాము మాత్రం పోటీలో ఉంటామంటూ నేతలు సోషల్ మీడియా ద్వారా ఇతరత్రా ప్రచార సాధనాల ద్వారా ప్రచారం చేసుకుంటున్నారు. యాదగిరి శేఖర్‌రావు తాను ఇండిపెండెంట్‌గా బరిలో ఉండనున్నట్లు ప్రకటించగా కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్‌సింగ్ పార్టీ అభ్యర్థిగా ఎంపిక చేస్తే పార్టీ పేరిట లేకపోతే ఇండిపెండెంట్‌గా పోటీలో ఉంటానని ప్రకటించారు. బీఎన్ రావు కూడా అదే ఆలోచనతో ఉన్నట్లు తెలిసింది. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేయడంతో పాటు మార్చి 3 నుంచి నామినేషన్లు ప్రారంభం కానుండడంతో అభ్యర్థుల విషయంలో ఒకటి రెండు రోజుల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ప్రకటన చేస్తాయని భావిస్తున్నారు.

రియాద్‌లో గ్లోబల్ లేబర్ మార్కెట్ సదస్సు

● హాజరైన గల్ఫ్ కార్మిక నేతలు



రియాద్ సదస్సుకు హాజరైన గల్ఫ్ కార్మిక నేతలు భీంరెడ్డి, చేతన తదితరులు

జగిత్యాల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న గ్లోబల్‌లేబర్ మార్కెట్‌సదస్సు బుధవారం ప్రారంభమైంది. 45దేశాల కార్మిక మంత్రులు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు, 200 మంది వక్తలు, 100కు పైగా దేశాలనుంచి సుమారు 5వేలకు పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. ఇండియన్ నేషనల్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టీయూసీ) జాతీయఉపాధ్యక్షుడు రామచంద్రకుంతియా, తెలంగాణకు చెందిన వలస కార్మికసంఘ నాయకుడు మంద భీంరెడ్డి, రియాద్‌లో నివసిస్తున్న ఏపీకిచెందిన సామాజిక సేవకురాలు చేతన ఈ సదస్సులో పాల్గొని ప్రసంగించారు. ఈ సదస్సులో ప్రభుత్వ, ప్రైవేటు రంగం, అంతర్జాతీయ కార్మిక సంస్థ ప్రతినిధుల మధ్య సమావేశాలు జరిపారు. కీలకమైన లేబర్ మార్కెట్ సవాళ్లను పరిష్కరించడం, వినూత్న పరిష్కారాలు, ఉత్తమ పద్ధతులు, ప్రపంచ అనుభవాలపై ఈ సదస్సులో చర్చించనున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన చెగ్యాం విద్యార్థులు



లాస్య, ఉదయశ్రీ, అమరేందర్

వెల్గటూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెగ్యాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో ప్రభాకర్, పీడీ మహేష్ తెలిపారు. నవంబరు 18న పెద్దపల్లిలో నిర్వహించిన జోనల్ స్థాయి అండర్ 14 బాల బాలికల విభాగంలో సందవేని మధుశ్రీ, కూనారపు లాస్య, సందవేని అమరేందర్‌లు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 29 నుండి 31 వరకు మెదక్ జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలలో వారు పాల్గొననున్నారు. కాగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపి కైన మధుశ్రీ, లాస్య, అమరేందర్‌లను ఎంఈవో ప్రభాకర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సామల కవిత, పీడీ మహేష్, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు అభినందించారు.

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ

ధర్మపురి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ధర్మపురిలో బుధవారం భక్తుల రద్దీ పెరిగింది. అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మౌని అమావాస్య పురస్కరించుకుని సుదూర ప్రాంతాల నుంచి క్షేత్రానికి భారీగా భక్తులు తరలివచ్చారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్యకల్యాణం జరిపించారు. శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల రావి చెట్టు ఆంజనేయ స్వామి చుట్టు భక్తులు ప్రదక్షిణలు చేశారు. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. అందంగా పూలతో అలంకరించిన స్వామివారలకు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రివరకు భక్తులు స్వామివారలను దర్శనం చేసుకున్నారు. ఆలయఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది సేవలు అందించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పురోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

కండ్లపల్లిలో అరుదైన శిల్పాలు

● పరిశీలించిన కొత్త తెలంగాణ చరిత్ర బృందం

బీర్‌పూర్,జనవరి 29(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలోని కండ్లపల్లిలో అరుదైన 8వ శతాబ్దం నుంచి 18వ శతాబ్దం వరకు వేరు వేరు కాలాలకు చెందిన అపురూప శిల్పాలు వెలుగుచూశాయి. విషయం తెలుసుకున్న కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ బృందం సభ్యులు బుధవారం కండ్లపల్లి గ్రామానికి వెళ్లి శిల్పాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కండ్లపెల్లి గ్రామంలో గుర్తించినశిల్పాలు వెయ్యేళ్ల చరిత్రగల శిల్పాలని, జైనం, శైవం, వైష్ణవం శిల్పాలని అన్నారు. వాటి నమునాలు చూస్తే 8వ శతాబ్దం నుంచి 18వశతాబ్దం వరకు వేర్వేరు కాలాలకు చెందిన శిల్పాలుగా గుర్తించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు వొద్దిపర్తి మధుకుమార్, చిట్నేని విజయ్ కుమార్, గ్రామ ప్రజల సహకారంతో గ్రామంలోని పలు ప్రదేశాలను పరిశీలించి శిల్పాలను గుర్తించారు. గుర్తించిన శిల్పాలలో రాష్ట్రకూటశైలి జైనతీర్థంకరుడు రుషభుని ధ్యానాసన శిల్పం,మరి రెండు వృషభలాంఛనాలతో రుషభుని శిల్పస్తంభాలు, వర్ధమహావీరుని అధిష్ఠానపీఠం, జైనబసది పూర్ణకలశం, 14, 15వ శతాబ్దాల శైలిలో గణపతి, కేశవమూర్తులిద్దరు, కుబేరుడు, విష్ణుమూర్తి, మహిషాసురమర్దని, నాగదేవత, 17,18వ శతాబ్దల శైలిలోచెక్కిన లోహకారుల దేవత మమ్మాయి శిల్పాలు, గుర్తించడానికి వీలు పడకుండా శిథిలమైన రెండు బహుభుజుల దేవతల శిల్పాలు గుర్తించినట్లు తెలిపారు. గ్రామంలోని గంగాధరి కోటయ్య ఇంటివద్ద జైన తీర్థంకరుని శిల్పంతో శాసనస్తంభం బయటపడ్డాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అద్భుతమైన వారసత్వ సంపదను పరిరక్షించి బావితరాలకు మన ఘన చరిత్రను తెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ దిశలో చరిత్రను, చారిత్రక ప్రదేశాలను తెలంగాణ చరిత్ర బృందం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అనేక విశేషాలని సరియైన నిర్ధారణతో ఆవిష్కరించినట్లు కొత్త తెలంగాణ చరిత్రబృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ తెలిపారు. ఈ శిల్పాల పరిశీలన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పర్వతం రమేష్ గౌడ్, గంగాధరి పూర్ణచందర్, వడ్లూరి రవి, కోట కిషన్ గౌడ్, గంగాధరి శంకర్ గౌడ్,పోతుగంటి శ్యాంసుందర్ గైడ్, అజ్మీర లక్ష్మన్, గంగాధరి గంగాధర్, కంది భీమన్న తదితరులు ఉన్నారు.



పురాతన విగ్రహాలను పరిశీలిస్తున్న కొత్త తెలంగాణ చరిత్ర బృందం





బయటపడ్డ పురాతన అపురూప శిల్పాలు

పంట పొలాల్లోకి భారీగా కెనాల్ నీరు



పొలాల్లో భారీగా చేరిన కెనాల్ నీరు

శంకరపట్నం, జనవరి 29 (ఆంధ్ర జ్యోతి): మండలం అంబాలాపూర్ గ్రామ శివారులో కాకతీయ ప్రధానకాలువ నుంచి డీబీఎం-12 ఉపకాలువద్వారా నీరు అధికంగా వదలడంతో పంట పొలాలకు భారీగా నీరుచేరింది. దీంతో వరిపంటకు తీవ్రనష్టం జరుగుతుందని రైతులు పేర్కొంటున్నారు. ఈసందర్భంగా బుధవారం వారు సంబంధిత అధికారులు చొరవ తీసుకొని పంటపొలాల్లోకి నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు సైనిక్ స్కూల్ విద్యార్థి

చొప్పదండి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు రుక్మాపూర్‌సైనిక్‌స్కూల్ 12వతరగతివిద్యార్థి బలరాం ఎంపికయ్యాడు. ఇటీవల కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. విద్యార్థిని స్కూల్ డైరెక్టర్ కల్నల్ కేసీరావు, ప్రిన్సిపాల్‌కాళహస్తి, ఉపాధ్యాయులు అభినందించారు.

క్రీడలతో సమాజంలో మంచి గుర్తింపు

● సీపీ అభిషేక్ మొహంతి ● కొనసాగుతున్న రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలు



కబడ్డీలో తలపడుతున్న హైదరాబాద్ సిటీ, తెలంగాణ ఇంటెలిజెన్స్ జట్లు



కబడ్డీలో తలపడుతున్న జోన్3 రాజన్న సిరిసిల్ల, బాసర మహిళా జట్లు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి అన్నారు. కరీంనగర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్, సీటీసీ, అంబేద్కర్ స్టేడియంలో కొనసాగుతున్న మూడో రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలను రెండో బుధవారం ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. క్రీడలతో స్నేహసంబంధాలు పెంపొందుతాయన్నారు. రాష్ట్రస్థాయిలో రాణించాలని, జాతీయస్థాయి పోటీల్లో తెలంగాణ క్రీడాపతాకాన్ని ఎగురవేయాలని అన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ ఐజీపీ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందనారు. కరీంనగర్ అడిషనల్ ఎస్పీ శుభంప్రకాశ్, కరీంనగర్ ట్రైనీ ఐపీఎస్ వసుంధర యాదవ్, కరీంనగర్ ఏసీపీ విజయ్‌కుమార్, ఆర్ఐ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

● ప్రతిభ చాటుతున్న పోలీస్ క్రీడాకారులు..

మూడో తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో 20 పోలీస్ జోన్ల నుంచి 2500 మంది క్రీడాకారులు 29 క్రీడాంశాల్లో పాల్గొంటున్నారు. ఖో-ఖో, కబడ్డీ, హ్యాండ్‌బాల్, వాలీబాల్, ఫుట్‌బాల్, యోగ, జిమ్నాస్టిక్స్, రెజ్లింగ్, లాన్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్, సైక్లింగ్, ఆర్చరీ, బాస్కెట్‌బాల్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, వాటర్ స్పోర్ట్స్, సెపక్ తక్రా, షటిల్ బ్యాడ్మింటన్‌లో పోటీలను నిర్వహిస్తున్నారు

జాతీయస్థాయిలో సత్తాచాటాలి: ఐజీ రమేష్ రెడ్డి



రెజ్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఐజీ రమేష్ రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా పోలీస్‌మీట్‌లో తెలంగాణ రాష్ట్రరెజ్లర్లు సత్తాచాటాలని ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(క్రీడలు) రమేష్ రెడ్డి అన్నారు. 3వ తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో భాగంగా బుధవారం ప్రాంతీయ క్రీడాపాఠశాలలో రెజ్లింగ్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెజ్లింగ్‌లో అన్ని జోన్ల నుంచి పోలీసులు పాల్గొనడం సంతోషకరమన్నారు. జాతీయస్థాయిలో పతకాలు సాధించే క్రీడాకారులకు ప్రోత్సాహకాలతోపాటు ఇంక్రిమెంట్లు అందించనున్నట్లు చెప్పారు. తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ కరీం మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగుల్లో అంతర్లీనంగా దాగిఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ పోలీస్ క్రీడలు దోహదపడతాయన్నారు. జాతీయ స్థాయి పోటీలకు ముందు ప్రత్యేక శిక్షణ శిబిరాలు నిర్వహిస్తే మన రాష్ట్ర క్రీడకారులు ఎక్కువ పతకాలు సాధించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో రూరల్ ఏసీపీ శుభం ప్రకాష్, తెలంగాణ జూడో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జనార్దన్ రెడ్డి, స్పోర్ట్స్ ఆఫీసర్ రామారావు, డీవైఎస్‌వో శ్రీనివాస్, రెజ్లింగ్ ఇన్‌చార్జి శేఖర్ రెడ్డి, గచ్చిబౌలి స్టేడియం ఏవోఆర్ఐ మధు, కోచ్‌లు జైపాల్, రాజు, వంశీకృష్ణ, శిరీష, పూర్ణసాయి, అఖిల్ పాల్గొన్నారు.

సదాశివపల్లి వద్ద జంక్షన్

ఏర్పాటు ఎప్పుడో?

- ప్రమాదాలకు నిలయంగా మారిన కూడలి
- ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వాహనదారుల ప్రయాణం

మానకొండూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నగర పాలక సంస్థ సదాశివపల్లి కూడలి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ కూడలి నుంచి ప్రతి రోజు పెద్ద వాహనాలు వెళుతుంటాయి. వరంగల్‌కు, హైదరాబాద్‌కు వెళ్లే వాహనాలు కరంనగర్ శివారులోని మానేరు వంతెన మీదుగా వెళ్లేవి. దీంతో వాహనాల రద్దీ పెరిగి ప్రతి రోజు ప్రమాదాలు జరుగుతుండేవి. ప్రమాదాలను తగ్గించేందుకు సదాశివపల్లి శివారులోని మానేరు వాగుపై తీగల వంతెనను నిర్మించారు. ఈ వంతెనను 20 నెలల క్రితం ప్రారంభించారు. తీగల వంతెన ఏర్పాటుతో నాలుగు కిలోమీటర్లు దూరం తగ్గడమే కాకుండా గోదావరిఖని ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు చుట్టూ తిరగాల్సిన అవసరం తప్పింది. అలుగునూర్ నుంచి, వరంగల్ నుంచి, తీగల వంతెన నుంచి వచ్చే రోడ్లు మానకొండూర్ మండలం సదాశివపల్లి వద్ద కలుస్తాయి. ఈ మూడు రోడ్లు కలిసే కూడలి వద్ద జంక్షన్ ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎలాంటి సూచికలు లేకపోవడంతో మూడు వైపుల నుంచి ఒకే సారి వాహనాలు స్పీడ్‌గా రావడంతో తరుచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. తీగల వంతెనపై ప్రయాణించడం వల్ల దూరం తగ్గిందని సంబరపడ్డ వాహనదారులు ప్రమాదాలతో భయపడుతున్నారు. నగర పాలక సంస్థ పాలకులు తీగల వంతెన ను నుంచి సదాశివపల్లి బస్టాండ్ వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. సదాశివపల్లి వద్ద జంక్షన్ ఏర్పాటు చేయాల్సి ఉండగా పట్టించకోవడం లేదు. దీంతో వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. గతంలో స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో ఇతర ప్రజాప్రతినిధులు సదాశివపల్లి కూడలిని సందర్శించి జంక్షన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు నెరవేర్చలేదుప. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి జంక్షన్ ఏర్పాటు చేయాలని గ్రామస్థులు, వాహనాదారులు కోరుతున్నారు.



ప్రమాదాలకు నిలయంగా మారిన సదాశివపల్లి కూడలి ఇదే

జంక్షన్ ఏర్పాటు చేయాలి..



- మాచర్ల కోటేశ్వర్, సదాశివపల్లి గ్రామస్థుడు

తీగల వంతెన నిర్మాణం అయిందని సంతోషపడ్డాం. సదాశివపల్లి బస్టాండ్ వద్ద మూడు వైపుల నుంచి ఒకే సారి వాహనాలు రావడంతో రోడ్డు దాటాలంటే భయపడుతున్నాం. ఎన్నికల్లో గెలిపిస్తే మూడు నెలల్లో జంక్షన్ ఏర్పాటు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హామీ ఇచ్చారు. ఇప్పటికి నిర్మాణం ప్రారంభించలేదు. వెంటనే జంక్షన్ ఏర్పాటు చేయాలి.

భయంతో ప్రయాణిస్తున్నాం



- కముటం సంపత్, వాహనదారుడు

సదాశివపల్లి బస్టాండ్ వద్ద మూడు వైపుల నుంచి వాహనాలు వేగంగా వస్తున్నాయి. దీంతో రోడ్డు దాటడడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు దాటాలంటే భయమవుతోంది. పాలకులు, అధికారులు స్పందించి జంక్షన్ ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలి.

మెట్‌పల్లి సీఐకి సన్మానం

మల్లాపూర్, జనవరి, 29 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అందజేసే ఇండియన్ పోలీస్ అవార్డుకు ఎంపికైన మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డిని కాంగ్రెస్ రాష్ట్ర కిసాన్ సెల్ జాయింట్ కోఆర్డినేటర్ వాకిటి సత్యంరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు సన్మానించారు. నాయకులు యండి జాఫర్, మిట్టపల్లి రాజేందర్, ఏడ్ల రాజు, గంగారెడ్డి ఉన్నారు.

చిలుకల చిన్నమ్మ జాతర

మల్లాపూర్, జనవరి, 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంగేమ్ శ్రీరాంపూర్ గ్రామంలో బుధవారం చిలుకల చిన్నమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మల్లాపూర్, జనవరి, 28 (ఆంధ్రజ్యోతి) : మల్లాపూర్ మండల కేంద్రంలోని వెంకటేశ్వర దేవాలయం ఆవరణలో మండల యాదవుల సమక్షంలో అఖిల భారత యాదవ మహా సభ 2025 క్యాలెండర్‌ను యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజారంయాదవ్ ఆవిష్కరించారు.

రెండో విడత గొర్రెల పంపిణీ

జగిత్యాలరూరల్, ఆగస్టు 29: జగిత్యాల రూరల్ మండలం ధర్మారం గ్రామంలో పశువైద్య సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరుగురు లబ్ధిదారులకు 6 గొర్రెల యూనిట్లను పంపిణీ చేశారు.

అనాథాశ్రమానికి చేయూత

రాయికల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండల కేంద్రంలోని గ్రీన్‌వుడ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలకు ఆర్థిక సహాయం అందించారు. గోదావరిఖని ప్రాంతానికి చెందిన ఎండీహెచ్‌డబ్ల్యూఎస్ అనాథ ఆశ్రమానికి పాఠశాలకు చెందిన విద్యార్థులు రూ.16,100 పోగు చేసి బుధవారం విరాళంగా అందించారు.

ఆర్ఎస్ఎస్ చీఫ్‌పై ఫిర్యాదు

కొడిమ్యాల, జనవరి29(ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ రామ మందిర ప్రతిష్ఠాపన సందర్భంగా భారత దేశానికి నిజమైన స్వాతంత్ర్యం అప్పుడే వచ్చిందన్న వివాదస్పద వ్యాఖ్యలు చేసినందుకు మండల ఎన్ఎస్‌యూఐ నాయకులు బుధవారం కొడిమ్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు విక్రంగౌడ్, నాయకులు చందు, సుల్తాన్, సాయి, కవ్వం మధు, జమాలుపూరి నిఖిల్, భరత్, వినయ్ ఉన్నారు.

రైతు భరోసా దరఖాస్తుల స్వీకరణ

కొడిమ్యాల, జనవరి29(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయలయంలో బుధవారం నూతనంగా పట్టాదారు పాసు బుక్కులు వచ్చిన రైతులు రైతు భరోసా కోసం దరఖాస్తులను ఏఈవో కె. ప్రశాంత్ స్వీకరిం చారు.

తపస్ క్యాలండర్ ఆవిష్కరణ

వెల్గటూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తునూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి ప్రభాకర్ చేతుల మీదుగా బుధవారం తపస్ ఉపాధ్యాయ సంఘం క్యాలండర్ ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు గాజంగి రాజేశ్వర్, ప్రధానోపాధ్యాయురాలు విమలాదేవి, ఉపాధ్యాయులు నర్సింగం, రాజేంద్రప్రసాద్, వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

ఆల్ఫోర్స్ విద్యార్థులకు సన్మానం

మల్యాల, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్, సీఎం కప్ కరాటే, కిక్ బాక్సింగ్ పోటీలలో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన ఆల్ఫోర్స్ విద్యార్థులను జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకొని బుధవారం సన్మానించారు. ఈ మేరకు పి.అక్షయ, ఎం.షర్మిలను అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి ప్రసాద్, జిల్లా విద్యాధికారి రాము, జిల్లా సంక్షేమ అధికారి నరేశ్, రాజ్‌కుమార్ తదితరులు సన్మానించారు.

రోడ్లపై తిరిగే పశువులను గోశాలకు తరలిస్తాం

ధర్మపురి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలో రోడ్లపై తిరిగే పశువులను యజమానులు తమ ఇంటికి తీసుకవెళ్లకపోతే వచ్చే ఫిబ్రవరి 1 నుంచి వాటిని గోశాలకు తరలిస్తామని మున్సిపల్ కమీషనర్ కందుకూరి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పశువుల యజమానులకు గతంలో నోటీసులు కూడా ఇవ్వడం జరిగిందని, వారిని ఆఫీస్‌కు పిలిచి మాట్లాడటం జరిగిందని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు మోగిన నగరా

● షెడ్యూల్ జారీ ● జిల్లాలో పట్టభద్రుల ఓట్లు 21,302 ● ఉపాధ్యాయ నియోజకవర్గంలో 1,730 మంది ఓటర్లు



జగిత్యాల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ పట్టభద్రుల నియోజక వర్గం, ఉపాధ్యాయ నియోజకవర్గం ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల సంఘం బుధవారం షెడ్యూల్ జారీ చేసింది. జగిత్యాలకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తాటిపర్తి జీవన్‌రెడ్డి ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న మెదక్ - నిజామాబాద్ - ఆదిలాబాద్ - కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం కాలపరిమితి, కూర రఘోత్తంరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న మెదక్ - నిజామాబాద్ - అదిలాబాద్ - కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గం కాలపరిమితి 2025 మార్చి 29వ తేదీతో ముగియనుంది. దీంతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఎమ్మెల్సీ ఎన్నికలను నిర్వహించడానికి షెడ్యూల్ విడుదల చేసింది. ఫిబ్రవరి 3వ తేదీన నోటిఫికేషన్ విడుదల, ఫిబ్రవరి 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, ఫిబ్రవరి 11వ తేదీన నామినేషన్ల పరిశీలన, ఫిబ్రవరి 13వ తేదీ వరకు నామినేషన్ల ఉప సంహరణ ఉంటుంది. ఫిబ్రవరి 27వ తేదీన ఉదయం 8 గంటల నుంచి 4 గంటల వరకు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నారు. మార్చి 3వ తేదీన ఓట్ల లెక్కింపు నిర్వహించి మార్చి 8వ తేదీ వరకు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయడానికి అనుగుణంగా రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది.

● పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గానికి జగిత్యాల జిల్లాలో 34,693 మంది పట్టభద్రుల ఓటర్లుండగా 21,302 మంది పురుషులు, 13,391 మంది స్త్రీలు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 51 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో 300 నుంచి 400 మంది వరకు ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేయనున్నారు.

● ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి జిల్లా వ్యాప్తంగా 1,730 మంది ఓటర్లుండగా ఇందులో 1,208 మంది పురుషులు, 522 మంది స్త్రీలు ఉన్నారు. జిల్లాలో 20 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికా రులు నిర్ణయించారు. ఎన్నికలను ప్రశాంతమైన వాతా వరణంలో పకడ్బందీగా నిర్వహించడంపై జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ నేతృత్వంలో అధికార యంత్రాంగం దృష్టి సారించింది.

అసంపూర్తి పనులపై కలెక్టర్ సీరియస్



స్టేడియంలో బిల్డింగ్ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

మెట్‌పల్లి టౌన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మినీ స్టేడియంలో నిర్మిస్తున్న బిల్డింగ్ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంపై జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అసహనం వ్యక్తం చేస్తూ సంబంధిత అధికారులపై సీరియస్ అయ్యారు. పనులు త్వరగా పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని మినీ స్టేడియంను, డంపింగ్ యార్డును, వైకుంఠ ధామంను ఆర్డీఓ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మినీ స్టేడియంలో నిర్మాణ దశలోనే ఆగిపోయిన బిల్డింగ్ పనుల గురించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేడియం అవరణలో పిచ్చి మొక్కలను తొలగించి పూర్తిగా శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంను సందర్శించి రికార్డులను పరిశీలించారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు ప్రజాపాలన కేంద్రంలో కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు వచ్చే దరఖాస్తులు నిరంతర ప్రక్రియ అని ఎప్పటికప్పుడు తీసుకోవాలని అన్నారు. అదే విధంగా డంపింగ్ యార్డును పరిశీలించి తడి చెత్తను, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. వైకుంఠ ధామంలో నీటి సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి. మోహన్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ అడ్లూరికి రైతుల కృతజ్ఞతలు

ధర్మపురి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రైతుల పంట పొలాలకు నీరందించే విషయంలో సహకరించిన ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు పలువురు కాంగ్రెస్ నాయకులు, రైతులు బుధవారం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దొనూర్, తీగలధర్మారం, గాదెపల్లి రైతుల పంట పొలాలు నీరందక ఎండిపోయే ప్రమాదం ఉందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దృష్టికి తీసుకవెళ్లారు. వెంటనే ఆయన స్పందించి ఎస్ఆర్ఎస్‌పీ డీఈఈతో ఫోన్ ద్వారా మాట్లాడగా సమస్య పరిష్కారం అయింది. ధర్మపురి ఏఎంసీ వైస్ చైర్మన్ సంగ నర్సింహులు, మాజీ సర్పంచ్ జంగిలి ప్రభాకర్, ముత్యపు సంతోష్, పోడేటి తిరుపతి, పోడేటి వెంకటేష్, పోడేటి ఉపేందర్, తోట సత్తన్న, మారినేని ఎర్రయ్య కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీగా దిష్టిబొమ్మల దహనాలు



బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



మల్లిఖార్జున ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

ధర్మపురి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా యుద్ధనౌక గద్దర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారని నిరసనగా ధర్మపురిలో యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మను బుధవారం దహనం చేశారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గాంధీ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. దిష్టి బొమ్మను దహనం చేస్తుండగా పోలీసులు చేరుకుని ఆపే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్ మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని అన్నారు. గద్దర్ చేసిన పోరాటాలు, ప్రజల కోసం గద్దర్ ఆడింది, పాడింది మరచిపోయినట్లు ఉందని అన్నారు. రజాకార్ల పాలన మీద యుద్ధం చేసిన గద్దర్ పాటలు, సాహిత్యం ద్వారా చైతన్య పరచిన ఉద్యమ వీరుడని అన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ ధర్మపురి నియోజకవర్గ అధ్యక్షులు అశోద అజయ్, మండల అధ్యక్షులు అప్పం తిరుపతి, ఉపాధ్యక్షులు పాల గణేష్, రాందేని మొగిలి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, ఏఎంసీ పాలకవర్గ సభ్యులు కాశెట్టి రాజేష్, ఎన్ఎస్‌యుఐ నియోజకవర్గ అధ్యక్షులు అప్పం శ్రవణ్, గణేష్, భరత్, గంగాధర్, శౌకత్, మల్లేష్, రాము, కార్తీక్, విఘ్నేష్, యశ్వంత్, యూత్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మల్లిఖార్జున ఖర్గే దిష్టిబొమ్మ దహనం

ధర్మపురి: హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా మల్లిఖార్జున ఖర్గే మాట్లాడారని బీజేపీ పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్ మాట్లాడుతూ గద్దర్‌కు ఏ విధంగా పద్మశ్రీ అడుగుతున్నారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ ధర్మపురి పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీని వాస్, మండల అధ్యక్షులు కుమ్మరి తిరుపతి, అసెంబ్లీ కో కన్వీనర్ బండారు లక్ష్మణ్,ఓబీసీ జిల్లా కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ ఉన్నారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు సరైనవే

● బీజేపీ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సాంబారి కళావతి

జగిత్యాల అగ్రికల్చర్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రజాగాయకుడు గద్దర్‌కు అవార్డు ఇవ్వాలనే అంశంపై మాట్లాడిన కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు సరైనవేనని బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబారి కళావతి అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా వ్యవహరించి, ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా పోరాడిన గద్దర్ పద్మశ్రీ అవార్డుకు ఎలా అర్హుడని ప్రశ్నించారు. కమ్యూనిస్ట్ భావజాలంతో సనాతన ధర్మాన్ని అవహేళన చేసే విధంగా హిందూ దేవుళ్లపై అసభ్య పదజాలంతో పాటలు రాసి, పాడి, హిందూ ధర్మాన్ని అవమానించిన వ్యక్తి గద్దర్ అని అన్నారు. ఆయన పేరుపై కాంగ్రెస్ ప్రభుత్వం అవార్డులు ఇచ్చే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. చట్ట విరుద్ధమైన చర్యలకు పాల్పడారని దేశద్రోహ కేసులు నమోదు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వమే నేడు పద్మశ్రీ అవార్డు కోసం గద్దర్ పేరును సిఫారసు చేయడం విడ్డూరం అన్నారు. బండి సంజయ్ వ్యాఖ్యలు సమర్థనీయంగా ఉన్నాయని, కాంగ్రెస్ నేతలు అనవసర విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టి ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మహిళా నాయకులు సాంబారి లక్ష్మీ, ఎలిగేటి లావణ్య, సబిత, లక్ష్మీ, పద్మ తదితరులున్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాపై సర్వే

జగిత్యాలరూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో ప్రభుత్వ భూమి కబ్జా విషయం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాలతో జగిత్యాల రూరల్ మండల తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం నర్సింగాపూర్‌లో సర్వే చేపట్టారు. ఈ విషయమై రూరల్ తహసీల్దార్‌ను వివరణ కోరగా మరో నాలుగు రోజుల్లో పూర్తిస్థాయిలో ప్రభుత్వభూమిని గుర్తించి హద్దులు ఏర్పాటు చేయడంతో పాటుగా, తదుపరి ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న వ్యక్తులను గుర్తించి నోటీసులు జారీ చేసి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంటామన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు

గొల్లపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని, వారికి పెద్ద మొత్తంలో డబ్బులు ముట్టజెప్పి ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు తప్పవని తహసీల్దార్ వరందన్ హెచ్చరించారు. బుధవారం గొల్లపల్లి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండల కేంద్రంలోని సర్వే నెం.735లోని ప్రభుత్వ భూమిలో కొందరు వ్యక్తులు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు తమ దృష్టికి వచ్చిందని, వాస్తవానికి ఎవరికీ ప్రొసీడింగ్స్ ఇవ్వలేదన్నారు. కొందరు వ్యక్తులు పైరవీ చేస్తూ అమాయకులను ఆసరా చేసుకుని వారి వద్ద డబ్బులు గుంజుతూ ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలకు పురిగొల్పుతున్నట్లు దృష్టికి వచ్చిందని, అలాంటి వారి మాటలు నమ్మవద్దన్నారు. అనంతరం మండల కేంద్రంలోని కబ్జాకు గురైన పలు స్థలాలను తహసీల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా అక్రమణలకు గురైన స్థలాల వివరాలపై ఒక నివేదికను తయారు చేసి సంబంధిత ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని అక్రమార్కులకు ఆదేశాలు జారీ చేశారు.

అనాథ మృతదేహానికి గ్రామస్థుల అంత్యక్రియలు

కథలాపూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతారంలో బుధవారం అనాథ వ్యక్తి మృతదేహానికి గ్రామస్థులు అంత్యక్రియలు నిర్వహించారు. ఆంధ్ర ప్రాంతానికి చెందిన అంజనేయులు అనే వ్యక్తి గత పదేళ్లుగా పోతారంలో కూలీ చేసుకుంటూ జీవిస్తున్నాడు. వారం రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతుండగా స్థానిక మాజీ సర్పంచ్ ధర్మపురి జలంధర్ జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి పంపించాడు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందడంతో మృతదేహాన్ని అంబులెన్స్‌లో పోతారం తీసుకువచ్చారు. గ్రామస్థులు శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

మందుబాబులకు అడ్డాగా పాఠశాల



పాఠశాల ఆవరణలో మద్యం సీసాలు



కొడిమ్యాలలోని ప్రాథమిక పాఠశాల

కొడిమ్యాల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల మైదానం మందుబాబులకు అడ్డగా మారింది. గ్రామ పంచాయతీ కార్యాలయానికి కొడిమ్యాల పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఈ మైదానం మందుబాబులకు అడ్డగా మారటంతో నిత్యం వాకింగ్‌కు వచ్చేవారు, క్రీడాకారులు ఆవేదన చెందుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపించడంతోనె ఉన్నత పాఠశాల మైదానంలో గోడల పక్కన చెత్త చెదారం పేరుకుపోయి, పిచ్చి మొక్కలు మొలిచాయని, పాఠశాల మైదానంలో ప్రైవేటు వ్యక్తులు వాహనాలను నిలిపినా ఎవరూ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పాఠశాల మైదానంలో మద్యం సేవించకుండా, పరిశుభ్రత పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఎంఈవో ఎ.శ్రీనివాస్‌ను వివరణ కోరగా పాఠశాల లోపల పరిశుభ్రంగా ఉందన్నారు. మైదానంలో గ్రామ పంచాయతీ వారు చెత్తను తొలిగించాల్సి ఉంటుందన్నారు. గ్రామ పంచాయతీ అధికారులకు సమాచారం అందిస్తామన్నారు.

ఇంటర్‌లో ఇంగ్లీష్ ప్రాక్టికల్స్

(5వపేజీ తరువాయి)

సంభాషించాల్సి ఉంటుంది. ఉదాహరణకు దుకాణదారుడు... వినియోగదారుల మధ్య సంభాషన రోల్ ప్లే చేయాల్సి ఉంటుంది. కమ్యూనికేటివ్ స్కిల్స్‌లో భాగంగా విద్యార్థి మాటలను ఒకటి లేదా రెండు నిమిషాలు పాటు రికార్డు చేస్తారు. దీనికి కూడా మార్కులు ఉంటాయి. ఇంటర్ ప్రాక్టికల్స్ నిర్వహించడానికి ఇంటర్ బోర్డు లెక్చరర్లకు ఇప్పటికే ప్రత్యేక శిక్షణ ఇచ్చింది.

పకడ్బందీగా ఇంటర్ ప్రాక్టికల్స్



ఇంటర్ స్థాయి నుంచే ఇంగ్లీష్ భాషపై విద్యార్థులు పట్టు సాధించేందుకు గత ఏడాది నుంచి విద్యాశాఖ ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్ష ప్రవేశపెట్టింది. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఈనెల 31వ తేదీ, ఫిబ్రవరి 1వ తేదీన రెండు విడతల్లో ప్రాక్టికల్ పరీక్ష నిర్వహించనున్నారు. విద్యార్థులు ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్షకు ఖచ్చితంగా హాజరుకావాలి. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- నారాయణ, జిల్లా ఇంటర్ విద్యాధికారి, జగిత్యాల

గ్రామదేవతలకు జలాభిషేకం

మల్లాపూర్, జనవరి, 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పునరావాస గ్రామమైన కుస్థాపూర్‌లోని రైతులు బుధవారం గ్రామదేవత విగ్రహాలకు గంగాజలంతో అభిషేకం చేశారు. మొగిలిపేట గోదావరి నదికి రైతులంతా వెళ్లి పవిత్ర స్నానాలు చేశారు. అనంతరం బిందెలతో గంగాజలం గ్రామానికి తీసుకొచ్చి దేవతామూర్తులకు అభిషేకం చేశారు. పంటలు సమృద్ధిగా పండాలని, పిల్లపాపలు చల్లంగా ఉండాలని కోరుకున్నారు.

జాతీయ బాలికల దినోత్సవం

జగిత్యాల అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన పోస్టర్ మేకింగ్‌లో విజేతలైన విద్యార్థులకు జిల్లా అడిషనల్ కలెక్టర్ లత, లీగల్ సెల్ అథారిటీ చైర్మన్ ప్రసాద్‌లు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు సంగీత రాణి, శ్రీలత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

చెరువులు, కుంటల అభివృద్ధికి చర్యలు చేపట్టాలి

కోరుట్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెరువులు కుంటల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కోరుట్ల డెవలప్మెంట్ సభ్యులు బుధవారం తహసీల్దార్ కిషన్‌కు వినతిపత్రం అందించారు. పట్టణంలోని మద్దుల చెరువు ప్రాంతంలోని ఎఫ్ఎల్‌టీలో బండ్ నిర్మాణం చేసి అభివృద్ధి పరిచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డెవలప్మెంట్ ఫోరం సభ్యులు పేట భాస్కర్, చెన్న విశ్వనాథం, ఎలిశెట్టి గంగారెడ్డి ఉన్నారు.

డ్రోన్‌తో పట్టణ సర్వే నిర్వహించిన అధికారులు



డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న అధికారులు

కోరుట్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బుధవారం డ్రోన్ సర్వే ఆఫ్ ఇండియా డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. అమృత్ 2.0 కింద పట్టణ డ్రోన్ సర్వేను అదనపు కలెక్టర్, కోరుట్ల మున్సిపల్ ప్రత్యేక అధికారి గౌతమ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ తిరుపతితో కలిసి ప్రారంభించారు. పట్టణంలో 48 సర్వే కేంద్రాలను ఏర్పాటు చేసి డ్రోన్ సర్వేను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీఓ ప్రవీణ్, మేనేజర్ శ్రీనివాస్, టీపీఎస్ రమ్య, గోపాల్ రావు, డ్రోన్ సర్వేయర్‌లు పాల్గొన్నారు.

మోదీ, మంద క్రిష్ణ మాదిగ చిత్ర పటాలకు క్షీరాభిషేకం

కొడిమ్యాల, జనవరి29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం బీజేపీ మండల శాఖ, ఎమ్మార్పీఎస్, మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో భారత ప్రధాని నరేంద్రమోదీ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద క్రిష్ణ మాదిగ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు బండ నర్సింహారెడ్డి, మాదిగ జేఏసీ అధ్యక్షుడు పర్లపెల్లి ప్రసాద్, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు నరేష్, నాయకులు నర్సింహారెడ్డి, జనార్దన్, తిరుపతిరెడ్డి, స్వామి, ఆనందం, మల్లేశం, శ్రీనివాస్, భూమేష్, శ్రీధర్, రవీందర్, నర్సయ్య, అజయ్, రాకేష్, ప్రభుదాసు పాల్గొన్నారు.

● మల్యాల: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ పద్మశ్రీ పురస్కారానికి ఎంపిక కావడంతో మల్యాలలో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు జరిపారు. కార్యక్రమంలో నలువాల సంజీవ్, శనిగారపు తిరుపతి, చిన్నదుర్గయ్య, తొడేటి బాబు, మెట్‌పల్లి అశోక్, దిలీప్, నివాస్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు అన్ని విధాలుగా సహకరిస్తాం



రవీందర్‌ను సన్మానిస్తున్న క్రీడాకారులు

కొడిమ్యాల, జనవరి29(ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులకు అందుబాటులో ఉండి అన్ని విధాలుగా సహకరిస్తానని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఖోఖో అసోసియేషన్ సెక్రటరీ మహేందర్‌రావు అన్నారు. ప్రపంచ కప్ ఖోఖో క్రీడలకు టెక్నికల్ అఫీషియల్‌గా బాధ్యతలు స్వీకరించిన డబ్బుతిమ్మయ్యపల్లి గ్రామానికి చెందిన ఫిజికల్ డైరెక్టర్ అనంతుల రవీందర్ బుధవారం రాత్రి కొడిమ్యాలకు రాగా క్రీడాభిమానులు ఆయనను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం మండల కేంద్రంలోని అంగడి బజారులో ఆత్మీయ అభినందన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మల్యా ల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నారాయణగౌడ్, బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కొడిమ్యాల గ్రామ నాయకుడు నర్సింహారెడ్డి, ప్రముఖ వైద్యుడు పి. జితేందర్, జగిత్యాల జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు విశ్వప్రసాద్, సెక్రటరీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మొరాయించిన ఎలక్ట్రిక్ బస్సు



కొండగట్టు సమీపంలో నిలిచిపోయిన ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సు

మల్యాల, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వరంగల్ నుంచి నిజామాబాద్ వెళ్తున్న వరంగల్-2 డిపోకు చెందిన ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సు కొండగట్టు సమీపంలో బుధవారం ఉదయం నిలిచిపోయింది. ఓ ప్రయాణికుడు మూత్రశాలకు వెళ్లడానికి నిలుపగా ప్రయాణికుడు వచ్చాక మళ్లీ బస్సు ఇంజన్ స్టార్ట్ చేసే క్రమంలో సాంకేతిక లోపం ఏర్పడింది. దీంతో ప్రయాణికులను మరో బస్సులో పంపించారు. ఇటీవల ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టగా పలు చోట్ల సాంకేతిక లోపాలు ఏర్పడడం ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది.